సాక్షి వికారాబాద్

గురువారం । 25 । సెప్టెంబర్ । 2025



అంత్యక్రియలకు వెళ్లి..
అంత్యక్రియలకు వెళ్లిన ఓ వ్యక్తి ఇంటికి వెళ్తున్న క్రమంలో చెరువులో స్నానం చేసేందుకు దిగి మృత్యువాత పడ్డాడు. 10లో ▸



బాబోయ్.. భౌభౌ
వీధి కుక్కల బెడద రోజురోజుకూ తీవ్రమవుతోంది. ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. 10లో ▸



పక్కాగా..లెక్క
రైతులు సాగు చేసిన పంటలను ప్రభుత్వం పక్కాగా లెక్కించేందుకు డిజిటల్ సర్వే చేపడుతోంది. 11లో ▸

న్యూస్‌రీల్

‘దళితబంధు’పై రహస్య తనిఖీలు
ధారూరు: మండలంలోని కేరెళ్లికి చెందిన దళిత బంధు లబ్ధిదారు చుక్కయ్య ఏర్పాటు చేసిన పౌల్ట్రీఫాంను బుధవారం ఉన్నతాధికారులు రహస్యంగా పరిశీలించారు. వీరిలో ఎస్సీ కార్పొరేషన్ కమిషనర్ క్షితిజా, ఎస్సీ డెవలప్‌మెంట్ కార్యదర్శి జ్యోతిబుద్ధప్రసాద్ ఉన్నట్లు తెలిసింది. పథకం కింద గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందించిన రూ.10 లక్షలు పౌల్ట్రీ ఫాంకు సరిపోయాయా..? అని ఆరా తీశారు. అయితే అదనంగా మరో రూ.4 లక్షలు ఖర్చు చేసి, నిర్మాణం పూర్తి చేశానని, ఏటా ఐదు బ్యాచ్‌ల కోళ్ల విక్రయిస్తున్నానని రైతు వివరించారు. ఒక్కో బ్యాచ్‌కు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు మిగులుతోందని తెలిపారు. కార్పొరేషన్ తరఫున సాయం చేస్తే మరో షెడ్డు వేసి నలుగురికి ఉపాధి కల్పిస్తానని స్పష్టంచేశారు. ఇదిలా ఉండగా దళితబంధు పథకంలో భాగంగా డబ్బులు తీసుకున్న లబ్ధిదారులు యూనిట్లు ఏర్పాటు చేశారా..? లేదా? అనే కోణంలో ఆరా తీసేందుకే రహస్య తనిఖీలు నిర్వహిస్తున్నారనే చర్చ సాగుతోంది.

పంట వివరాలు నమోదు చేసుకోండి
జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం



పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు

కొడంగల్ రూరల్: రైతులు సాగు చేసిన పంటల వివరాలను వ్యవసాయాధికారులకు తెలియజేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం సూచించారు. బుధవారం మండలంలోని రుద్రారం గ్రామంలో పంట వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. పంట వివరాలను అక్టోబర్ 31వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి జి.తులసి, ఏఈఓ శ్రీపతిరెడ్డి, రైతులు వెంకటయ్య, మొయినొద్దీన్ పాల్గొన్నారు.

తాండూరుకు చేరిన బతుకమ్మ చీరలు



ఐకేపీ కార్యాలయంలో నిల్వ చేసిన చీరలు

తాండూరు రూరల్: పట్టణంలోని ఐకేపీ కార్యాలయానికి బుధవారం బతుకమ్మ చీరలు వచ్చాయి. నియోజకవర్గంలోని తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాలకు కలిపి 45,600 చీరలు రావాల్సి ఉండగా 25,231 వచ్చినట్లు తాండూరు ఏపీఎం బాలయ్య తెలిపారు. మరో 20,369 చీరలు రావాల్సి ఉందన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేతుల మీదగా వీటిని పంపిణీ చేస్తామన్నారు.

రేపటి వరకు గడువు
అనంతగిరి: వికారాబాద్‌లోని శ్రీ అనంత పద్మనాభ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2025 – 26 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీలో ప్రవేశాల గడువు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జె.మందారిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి, ద్వితీయ, తృతీయ సంవత్సరం అడ్మిషన్ల గడువు 26వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు లేదా సమాన అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9182758406, 9440212625లలో సంప్రదించాలని సూచించారు.

యంత్రం జాడేదీ!

రాయితీ వ్యవసాయ పరికరాల కోసం రైతుల ఎదురుచూపులు

- ఆరు నెలల క్రితం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- జిల్లాకు 454 యూనిట్లు మంజూరు
- మహిళా రైతులకు మాత్రమే..
- రూ.3 వేల నుంచి గరిష్టంగా రూ.5 లక్షల వరకు ఉపయోగం



వికారాబాద్: రాయితీ యంత్ర పరికరాల కోసం మహిళా రైతులు ఎదురుచూడక తప్పడం లేదు. దరఖాస్తులు స్వీకరించి ఆరు నెలలు కావస్తున్నా కేంద్ర ప్రభుత్వం వాటి ఊసెత్తడంలేదు. మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీపై పథకం అమలు చేయాలని నిర్ణయించింది. కిసాన్, స్వయం సహాయక సంఘాల ద్వారా పరికరాల కొనుగోలుకు అవకాశం కల్పించింది. అయితే ప్రక్రియ దరఖాస్తుల దశ దాటడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం యంత్రలక్ష్మి పథకం పేరిట వ్యవసాయ పనిముట్లు అందిస్తూ వచ్చిన విషయం తెలిసిందే. బీఆర్‌ఎస్ హయాంలో రైతు బంధు, రైతు బీమా పథకాల కారణంగా రాయితీ యంత్రాలకు స్వస్తి పలికారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ పథకం అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించినా ఇంకా ప్రారంభం కాలేదు. ఈలోగా కేంద్ర ప్రభుత్వం మహిళా రైతులకు సబ్సిడీపై పని ముట్లు ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా దరఖాస్తులు కూడా స్వీకరించింది.

అర్హులు ఎవరంటే..
2024 – 25 వ్యవసాయ సంవత్సరానికి గాను ఈ పథకం వర్తింపజేయనున్నారు. రూ.3 వేల నుంచి గరిష్టంగా రూ.5 లక్షల వరకు రాయితీ వర్తించనుంది. ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు రిజర్వేషన్ ప్రాతిపదికన వాటా కేటాయించగా మిగతా సామాజిక వర్గాలకు జనరల్ కేటగిరి కింద కేటాయించారు. మహిళా రైతులందరూ ఈ పథకానికి అర్హులు. ఎకరంలోపు వ్యవసాయ భూమి ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.లక్షకు పైగా విలువ చేసే యంత్రాలు కావాల్సి వస్తే ఒక ఎకరం కంటే ఎక్కువ భూమి ఉండాలి. ఎకరంలోపు ఉంటే రూ.లక్షలోపు యంత్రాల కోసం అర్జీ పెట్టుకోవచ్చు. వ్యవసాయ డ్రోన్లు, మినీ ట్రాక్టర్లు కావాలంటే కనీసం రెండున్నర ఎకరాల పొలం ఉండాలి. జిల్లాస్థాయి కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేయనుంది.

జిల్లాకు 454 యూనిట్లు
జిల్లాకు 454 యూనిట్లు మంజూరు చేశారు. జనరల్ కేటగిరి కింద చిన్న, సన్నకారు రైతులతోపాటు పెద్ద రైతులు వస్తారు. వీరికి 338 యూనిట్లు కేటాయించారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మహిళా రైతుల కోసం 77 యూనిట్లు, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన చిన్న, సన్నకారు, పెద్ద రైతులకు 39 యూనిట్లు కేటాయించారు. వికారాబాద్ నియోజకవర్గంలోని ఎస్సీలకు 25, ఎస్టీలకు 11, జనరల్‌కు 116 యూనిట్లు కేటాయించారు. పరిగి నియోజకవర్గంలోని ఎస్సీలకు 17, ఎస్టీలకు 09, జనరల్‌కు 77 యూనిట్లు కేటాయించారు. కొడంగల్ నియోజకవర్గంలోని ఎస్సీలకు 20, ఎస్టీలకు 11, జనరల్‌కు 79 యూనిట్లు మంజూరు చేశారు. తాండూరు నియోజకవర్గంలోని ఎస్సీలకు 15 యూనిట్లు, ఎస్టీలకు 8, జనరల్ మహిళలకు 64 యూనిట్లు కేటాయించారు. ఇందులో కాళ్లు, చేతుల సాయంతో పని చేసే స్ప్రేయర్లు, బ్యాటరీతో పని చేసే స్ప్రేయర్లు ఉన్నాయి. నాగలి, గొర్రు, ఎరువులు, విత్తనాలు వేసే ట్రాక్టర్‌కు వినియోగించే పరికరాలు, పురుగుల మందు స్ప్రే చేసేం డ్రోన్లు కూడా ఉన్నాయి. పవర్ వీడర్లు, బ్రష్ కటర్లు తదితర యంత్ర పరికరాలను రాయితీపై అందజేయనున్నారు. ఈ విషయమై డీఏఓ రాజరత్నంను వివరణ కోరగా యంత్ర పరికరాల కోసం రైతులు దరఖాస్తులు చేసుకున్న విషయం నిజమే కానీ, అర్హుల ఎంపికపై తమకెలాంటి ఆదేశాలు అందలేదని తెలిపారు.



మంచాల పాఠశాల అభివృద్ధి ప్రణాళిక మ్యాప్‌ను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

- రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ ఛైర్మన్ ఆకునూరు మురళి
- ఆరుట్ల, మంచాల ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన అధికారుల బృందం

మంచాల: తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల(టీపీఎస్) అభివృద్ధి పనులను వేగిరం చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ ఛైర్మన్ ఆకునూరు మురళి, డైరెక్టర్ నవీన్ నికోలస్ అన్నారు. బుధవారం వారు మంచాల మండల పరిధిలోని ఆరుట్ల, మంచాల ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల అభివృద్ధి ప్రణాళిక, జరుగుతున్న పనులు తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరుట్లలో ప్రీ ప్రైమరీ పాఠశాల నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేస్తే అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు సులువుగా ఉంటుందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలు కల్పిస్తున్నామని.. విద్యార్థుల సంఖ్య సైతం అదే విధంగా పెరిగిందన్నారు. డిజిటల్ తరగతులు, క్రీడా ప్రాంగణం, పౌష్టికాహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. పనులు మరింత వేగిరం చేయాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధితోనే పిల్లల భవిష్యత్ మారుతుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. అదనపు తరగతి గదులు, లైబ్రరీ, సరిపడా ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని పేరెంట్స్ కమిటీ కోరింది. అనంతరం మంచాల ప్రభుత్వ పాఠశాలను సందర్శించి అక్కడ చెప్పట్టే అభివృద్ధి కార్యక్రమాలను మ్యాప్ ద్వారా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ సుశీందర్‌రావు, విద్యా కమిషన్ సభ్యులు పద్మజాషా, జ్యోత్స్న, ఎంఈఓ రాందాస్, మంచాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య, ప్రధానోపాధ్యాయులు గిరిధర్‌గౌడ్, నారాయణరెడ్డి, ఝాన్సీ, రుబియానా బేగం, మోహన్‌రెడ్డి, ఆయా పాఠశాలలకు చెందిన పేరెంట్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 14న సీఎం రాక?
ఈ నెల 22న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వసతులు, విద్యాశాఖ అధికారులతో సమావేశమై విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే భాగంగానే పనులు వేగవంతగా చేపట్టాలని ఉన్నత స్థాయి అధికారులు సందర్శనార్థం వచ్చినట్లు సమాచారం. నవంబర్ 14న సీఎం వచ్చే అవకాశం ఉందని వినికిడి.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం



ఆంజనేయులు, మహేష్‌ను సన్మానిస్తున్న నేతలు

- అధిక స్థానాలు సొంతం చేసుకుంటాం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

కుల్కచర్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటి అధిక స్థానాలు సొంతం చేసుకుంటామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు అన్నారు. బుధవారం కుల్కచర్లలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత మోర్చా మండల అధ్యక్షుడిగా ఆంజనేయులును, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బీజేపీ శ్రేణులు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జి.వెంకటయ్య ముదిరాజ్, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు వెంకటయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ హరికృష్ణ, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కాటనిపల్లి ఆంజనేయులు, మైపాల్, నాయకులు రాంచంద్రయ్య, కొండ ఆంజనేయులు, సూర్యకాంతం, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అపోహలు నమ్మొద్దు
చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: జీఎస్టీ తగ్గింపుపై ప్రతిపక్షాల దుష్ప్రచారాలను నమ్మొద్దని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన నియోజకవర్గ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంతో కలిసి పర్యటించారు. దుకాణదారులకు జీఎస్టీ తగ్గింపుపై సందేహాలను నివృత్తి చేశారు. ఎలక్ట్రికల్ దుకాణం, కార్లు, బైక్ షోరూంలు, మెడికల్ షాపు తదితర వ్యాపారస్తులను కలిసి జీఎస్టీ తగ్గింపుతో ఎలాంటి ప్రయోజనాలున్నాయో అడిగి తెలుసుకున్నారు. పలువురు దుకాణాదారులు ముందుగానే స్టాక్ తెచ్చుకోవడంతో వ్యాపారులకు నష్టం వాటిల్లుతోందన్నారు. ముందుగా తెచ్చుకున్న వాటి జీఎస్టీ మళ్లీ వెళ్లినప్పుడు తగ్గించి చెల్లిస్తారని చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వం దేశంలోని ప్రజలకు, వ్యాపారులకు మేలు చేకూర్చేందుకే ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ప్రతీ ఒక్కరు పన్నులు చెల్లించే విధానంతో వ్యాపార నిర్వహణలో పారదర్శకత పెరిగిందన్నారు. ప్రభుత్వాల ఆదాయం పెరిగిందన్నారు.

బరిలో తొమ్మిది మంది

- మదర్ డెయిరీ సభ్యుల నియామకానికి 27న ఎలక్షన్

హయత్‌నగర్: నల్లగొండ– రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సమాఖ్య లిమిటెడ్(నార్ముల్ మదర్ డెయిరీ) పాలకవర్గ ఎన్నికల్లో తొమ్మిది మంది చివరి బరిలో నిలిచారు. డెయిరీలో ఖాళీగా ఉన్న ముగ్గురు సభ్యుల నియామకం కోసం దాఖలు చేసిన నామినేషన్ల ఉప సంహరణ, స్క్రూటినీ అనంతరం తొమ్మిది మంది తుది పోటీలో ఉన్నారు. మహిళా రిజర్వేషన్ స్థానానికిగానూ కర్నాటి జయశ్రీ, గుంట్ల రాధిక, మోతె పూలమ్మ, సుదగాని విజయ తలపడనున్నారు. మిగిలిన రెండు అన్‌రిజర్వ్ స్థానాల్లో కుంచాల ప్రవీణ్‌రెడ్డి, పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రచ్చ లక్ష్మీనర్సింహ్మారెడ్డి, శీలం వెంకటనర్సింహ్మారెడ్డి, సందిల భాస్కర్‌గౌడ్ పోటీ పడుతున్నారని ఎన్నికల అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. హయత్‌నగర్‌లోని ఎస్వీ కన్వెన్షన్ హాల్ లో శనివారం ఉదయం 8 గంటల నుంచి ఒంటిగంట వరకు పోలింగ్ కొనసాగుతుందని స్పష్టంచేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాలు, విజేతల ప్రకటన ఉంటుందన్నారు. ఎన్నికయ్యే సభ్యులు అక్టోబర్ 1న బాధ్యతలు చేపడుతారని వెల్లడించారు. అర్హులైన సొసైటీల చైర్మన్లు ఐడీ కార్డుతో వచ్చి ఓటింగ్‌లో పాల్గొనాలన్నారు.

యూరియా మహాప్రభో..!

- పక్షం రోజులుగా ఎరువుల కొరత
- కార్యాలయాల వద్ద నిత్యం పడిగాపులే
- సాగుకు సరిపడా సరఫరా చేయని వైనం
- బస్తాతో సరిపెడుతున్న అధికారులు
- ఆందోళనలో అన్నదాతలు



బషీరాబాద్: నావంద్గీ సొసైటీ కార్యాలయం వద్ద టోకెన్ల కోసం అన్నదాతల పాట్లు



తాండూరు రూరల్: ఎల్మకన్నె సొసైటీ కార్యాలయం వద్ద చెప్పల క్యూ

తాండూరు రూరల్/బషీరాబాద్: యూరియా బాధలు ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. జిల్లా వ్యాప్తంగా రైతాంగాన్ని ఈ సమస్య వెంటాడుతోంది. తెల్లవారింది మొదలు సొసైటీ కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. రోజంతా పడిగాపులు కాసినా బస్తా కూడా దొరకడం లేదని ఆందోళన చెందుతున్నారు. నెల రోజులుగా ఇదే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలం పనులు వదిలేసి యూరియా కోసం తిరగాల్సి వస్తోందని పలువురు పేర్కొన్నారు. మా బాధలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం పంటలకు పైపాటుగా యూరియా వాడాల్సి ఉందని తెలిపారు. బుధవారం తాండూరు పట్టణంలోని ఎల్మకన్నె సొసైటీ కార్యాలయానికి రైతులు పెద్ద సంఖ్యలో వచ్చారు. చెప్పులను క్యూలో ఉంచి యూరియా కోసం గంటల తరబడి వేచి ఉన్నారు. బషీరాబాద్ మండలం నావంద్గీ సొసైటీ కార్యాలయం వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. యూరియా కొరతపై రైతులు తరచూ రోడ్డెక్కుతున్నారు. సాగుకు సరిపడా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వారం రోజులుగా పడిగాపులు



వారం రోజులుగా యూరియా కోసం నావంద్గీ సొసైటీ కార్యాలయానికి వస్తున్నా. కనీసం టోకెన్ కూడా దొరకడం లేదు. 4.18 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. ఇప్పటి వరకు యూరియా వాడలేదు. పంట దెబ్బతింటోంది. నాలుగు సంచుల యూరియా ఇస్తే పంటను కాపాడుకుంటా.

– జగదీష్, రైతు, గంగ్వార్

ఇండెంట్ ప్రకారమే..



మండల వ్యవసాయ అధికారులు పంపిన ఇండెంటు ప్రకారం సొసైటీకి యూరియా వస్తోంది. ఇప్పటి వరకు 8వేల బస్తాలు పంపిణీ చేశాం. ఇంకా 80 మెట్రిక్ టన్నులు అవసరం ఉంది. రైతుల బాధలు చూడలేకపోతున్నాం. సాగుకు సరిపడా యూరియా వస్తే ఇబ్బందులు ఉండవు.

– వెంకట్‌రామ్‌రెడ్డి, చైర్మన్, నావంద్గీ సొసైటీ

ఆందోళన వద్దు
తాండూరు మండలంలో యూరియా కొరత లేదు. బుధవారం ఎల్మకన్నె సొసైటీకి 450 బస్తాల యూరియా వచ్చింది. రైతులందరికీ సరఫరా చేస్తున్నాం. గురువారం చెంగోల్ గ్రామంలో యూరియా అందుబాటులో ఉంటుంది. రైతులు ఆందోళన చెందరాదు. పట్టాదారు పాసు పుస్తకం తెచ్చి యూరియా తీసుకెళ్లాలి.

– కొమురయ్య, ఏడీఏ, తాండూరు

చంద్రప్రభ వాహనంపై శ్రీవారు



చంద్రప్రభ వాహనంపై కొలువుదీరిన స్వామివారు



చిన్నారుల నృత్య ప్రదర్శన

వికారాబాద్ పట్టణంలో వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మూడోరోజు బుధవారం రాత్రి స్వామివారు చంద్రప్రభ వాహనంపై విహరించారు. ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. 11 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఉత్సవాల్లో బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమం పీఠాధిపతి డాక్టర్.మహంత్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ పాల్గొన్నారు. మంగళవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల కూచిపూడి నృత్యం ఎంతగానో ఆకట్టుకుంది.

– అనంతగిరి



కల్యాణ శోభిత శ్రీవారు, అమ్మవార్లు

క్లుప్తంగా

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

డీఎల్‌పీఓ ప్రవీణ్‌కుమార్



డీఎల్‌పీఓను సన్మానిస్తున్న ఎంపీఓ తదితరులు

యాలాల: రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉంచుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం యాలాల జీపీ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, పారిశుద్ధ్యం, అభివృద్ధి కార్యాచరణ తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. డీఎల్‌పీఓగా బాధ్యతలు చేపట్టాక ఆయన తొలిసారి మండలానికి రావడంతో ఎంపీఓ యాదయ్య ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి ఆనంద్‌రావు, సిబ్బంది సాయి, జగదీశ్వర్, జానీ తదితరులు ఉన్నారు.

రోడ్డుపై దిగబడిన లారీ



ఐనెల్లి వద్ద రోడ్డు మధ్యలో దిగబడిన సిమెంట్ ట్యాంకర్ లారీ

తాండూరు రూరల్: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కల్వర్టు నిర్మాణం అనంతరం దానిపై పోసిన మట్టిలో ఓ సిమెంట్ ట్యాంకర్ లారీ బుధవారం దిగబడింది. వివరాలు ఇలా ఉన్నాయి. అల్లాపూర్ నుంచి కోత్లాపూర్ వరకు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఐనెల్లి గ్రామ శివారు వద్ద నేషనల్ హైవే అధికారులు కల్వర్టును తొలగించారు. ఆపై పైపులు వేసి, మట్టితో పూడ్చారు. భారీ వర్షాల కారణంగా సిమెంట్‌లోడ్‌తో వెళ్తున్న భారీ వాహనం రోడ్డు మధ్యలో కూరుకుపోయింది. దీంతో తాండూరు– చించోళి మార్గంలోని కోటబాసుపల్లి, మల్కాపూర్, కోత్లాపూర్, సంగెంకలాన్‌తో పాటు కర్ణాటకకు వెళ్లే వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి. ఎట్టకేలకు జేసీబీ సహాయంతో ఆ వాహనాన్ని వెలుపలకు తీసి, ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ప్లాస్టిక్ గోదాంలో అగ్ని ప్రమాదం



గోదాంలో ఎగిసిపడుతున్న మంటలు

పహాడీషరీఫ్: ప్లాస్టిక్ గోదాంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ సంఘటన బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాం కాలనీలోని ఇందిరా సొసైటీలో మధుబన్ కాలనీకి చెందిన శేషు, ప్లాస్టిక్ రీసైక్లింగ్ గోదాం నిర్వహిస్తున్నారు. ఉదయం 4 గంటల సమయంలో కర్మాగారంలో అగ్ని కీలలు ఎగిసి పడ్డాయి. గమనించిన స్థానికులు పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా.. వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. అప్పటికే అందులోని ప్లాస్టిక్ స్క్రాప్ పూర్తిగా కాలిపోయింది. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, రూ.8 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని యజమాని తెలిపారు. ఎలాంటి ఫిర్యాదు అందనందున కేసు నమోదు చేయలేదని పోలీసులు చెప్పారు.

'ఏఓఈఎఫ్'కు దరఖాస్తుల ఆహ్వానం

తుక్కుగూడ: విదేశీ వర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం(ఏఓఈఎఫ్) కింద 2025–26కు గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి జె.రామారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా షెడ్యూల్ కులాలకు చెందిన విద్యార్థులకు రూ.20లక్షల స్కాలర్‌షిప్ పొందేందుకు యూఎస్‌ఏ, ఇంగ్లాండ్, స్విట్జర్లాండ్, కెనడా, న్యూజిలాండ్, సింగపూర్, సౌత్‌కొరియా, ఆస్ట్రేలియా, జర్మనీ వర్సిటీల్లో మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సులతో పాటు పీజీ, పీహెచ్‌డీ కోర్సులు చేయాలనుకునే వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నవంబర్ 19 వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని చెప్పారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి

కేశంపేట: పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలను వెంటనే విడుదల చేయాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన సంఘం, ఏఐటీయూసీ నాయకులతో కలిసి నగరంలోని పంచాయతీరాజ్ కార్యాలయానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై పంచాయతీరాజ్ డైరెక్టర్ సృజనకు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటరాజ్యం, నాయకులు రామచంద్రయ్య, పద్మమ్మ తదితరులు ఉన్నారు.

బాబోయ్.. భౌభౌ



విశ్వాసానికి మారుపేరైన శునకాలు.. విచక్షణ కోల్పోయి వింతగా ప్రవర్తిస్తున్నాయి. దీంతో ప్రజలే కాదు.. జంతు ప్రేమికులు సైతం ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కుక్క కాటు కేసులు పెరుగుతుండటంతో వాటికి దూరంగా ఉండటమే మంచిదన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామ సింహాల హల్‌చల్
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- మల్కాపూర్‌లో స్వైరవిహారం
- 20కి పెరిగిన కుక్కకాటు బాధితుల సంఖ్య



కుక్కల నుంచి కాపాడాలని డిమాండ్ చేస్తున్న గ్రామస్తులు



గాయాన్ని చూపుతున్న బాలుడు

తాండూరు రూరల్: వీధి కుక్కలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇంటి నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. ఎటునుంచి వచ్చి పిక్కలు పట్టేస్తుందోనని భయాందోళన చెందుతున్నారు. పల్లెలు, పట్టణాల్లో వీధి కుక్కల బెడద అంతకంతకూ పెరిగిపోతుండగా.. అదే స్థాయిలో కేసులు పెరుగుతుండటం ఆదోళన కలిగిస్తోంది.

వెంబడించి..

మండల పరిధి 33 గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. మేజర్ గ్రామపంచాయతీ మల్కాపూర్, సమీపంలోని కోటబాసుపల్లి, వడ్డెరబస్తీని కలుపుకొని ఇక్కడ సుమారు ఐదు వేలకు పైగా జనాభా ఉంది. ఈ గ్రామంలోని ఏ వీధిలో చూసినా కుక్కల గుంపు ప్రజలను కలవరపాటుకు గురిచేస్తోంది. అకారణంగా దాడులకు పాల్పడుతూ ఆందోళనకు గురిచేస్తున్నాయి. వారం రోజుల క్రితం నడుచుకుంటు వెళ్తున్న బాలుడు ఆనంద్‌ను కరిచాయి. అంతే కాకుండా గడిచిన కొద్దిరోజుల్లో మన్సన్‌పల్లి బాలరాజ్, కుర్వ మణిక్యప్ప, హన్మంత్, ప్రణయ్, భాగ్యలను కాటు వేశాయి. దీంతో సుమారు 20 మంది వరకు బాధితులు ఉంటారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. కుక్కకాటు బాధితులు రేబిస్ వ్యాధితో చనిపోతున్నారన్న వార్తల నేపథ్యంలో బాధితులు, గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఒంటరిగా ఏ ఒక్కరు నడిచుకుంటు వెళ్లినా వెంబడిస్తున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి, గ్రామసింహాల బారి నుంచి కాపాడాలని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దారిన పోయే వారిపై..



వీధుల్లో కుక్కల గుంపుని చూసి భయపడుతున్నాం. మా కాలనీలో చిన్నారులపై తరచూ దాడులు చేస్తున్నాయి. రోజురోజుకూ వాటి ఆగడాలు పెరిగిపోతున్నాయి. దారిన పోయే వారిపై అకారణంగా ఎగబడుతున్నాయి. అధికారులు స్పందించి, వాటి నుంచి రక్షణ కల్పించాలి.

– రాములమ్మ, మల్కాపూర్ గ్రామం

నియంత్రణకు కృషి

గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. ఇదే విషయాన్ని పశువైద్యాధికారులతో పాటు పంచాయతీరాజ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. వాటి నియంత్రణకు కృషి చేస్తా. ఎవరూ ఆందోళన చెందవద్దు.

– ఇస్మాయిల్, జీపీ కార్యదర్శి, మల్కాపూర్

కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి

- పరిగికి నలువైపులా రహదారుల విస్తరణ
- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీఆర్‌ఆర్

పరిగి: గతంలో ఎన్నడూ జరగనంత అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు జాతీయ రహదారి నిర్మాణానికి అడ్డంకులు తొలగడంతో.. బుధవారం రోడ్డు విస్తరణ సాధన సమితి సభ్యులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నందున రూపురేఖలు మారుతున్నాయని చెప్పారు. గతంలో ఎన్‌హెచ్ 163 అభివృద్ధిని గత ప్రభుత్వం అడ్డుకుందని ఆరోపించారు. ప్రస్తుతం అడ్డంకులు తొలిగి, పనులు ప్రారంభం అయ్యాయని, అవి పూర్తయితే జిల్లాకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పరిగి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. పరిగి నుంచి కొడంగల్‌కు నాలుగు లైన్లు, జిల్లా కేంద్రానికి నాలుగు లైన్ల రోడ్డు పనులు జరుగుతున్నాయని వివరించారు.

గుడిసె లేని ఊరే లక్ష్యం

గుడిసెలు లేని ఊరు ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని సుల్తాన్‌పూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ.. పదేళ్లు అధికారంలో ఉండి, ఏ ఒక్క పేదవాడికి ఇళ్లు కట్టించి ఇవ్వలేదని విమర్శించారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే పేదవారి సొంతింటి కల నెరవేర్చిందన్నారు.

అంత్యక్రియలకు వెళ్లి.. శవమై తేలి

స్నానానికి చెరువులో దిగి వ్యక్తి గల్లంతు



శ్యాణప్ప (ఫైల్)

బషీరాబాద్: అంత్యక్రియలకు వెళ్లిన ఓ వ్యక్తి అనంత లోకాలకు వెళ్లాడు. ఈ సంఘటన బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి మంతట్టి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నుమాన్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లింగంపల్లి శ్యాణప్ప(52) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. మంగళవారం అదే గ్రామానికి చెందిన అభిషేర్ అంత్యక్రియల్లో పాల్గొన్న ఆయన.. ఇంటికి తిరిగి వస్తూ మార్గమధ్యలో స్నానం చేయడానికి పిన్‌చెరువులోకి దిగి నీట మునిగి చనిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు చెరువు వద్దకు వెళ్లి ఆచూకీ కోసం గాలించారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. చీకటి పడడంతో గాలింపు సాధ్యపడలేదు. బుధవారం ఉదయం గజ ఈతగాళ్లను రప్పించి, మృతదేహాన్ని బయటకు తీశారు. మద్యం మత్తులో ఉండటంతోనే శ్యాణప్ప నీటి మునిగి మృతి చెందాడని మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతుడికి కొడుకు శ్యామప్ప, కూతురు సవిత ఉన్నారు.



చెరువులో నుంచి మృతదేహాన్ని వెలికి తీస్తున్న గజ ఈతగాళ్లు

నిర్మాణ రంగంలో 'భారతి సిమెంట్' రారాజు



తాపీ మేస్త్రీలు, డీలర్లతో సంస్థ ప్రతినిధులు

అనంతగిరి: నిర్మాణ రంగంలో రారాజు భారతి సిమెంట్ అని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ సామ్రాట్ అన్నారు. వికారాబాద్‌లోని ఓం సాయి ట్రేడర్స్ డీలర్ దుకాణంలో బుధవారం తాపీ మేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా పూర్తవుతుందని తెలిపారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారుల నిర్మాణానికి సరైన ఎంపిక అని పేర్కొన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని, స్లాబ్ కాంక్రిట్ సమయంలో నిపుణులైన సంస్థ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని చెప్పారు. ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌కు రూ.20 అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ.1 లక్ష ప్రమాద బీమా బాండ్లను 60 మంది తాపీ మేస్త్రీలకు అందజేశారు. అనంతరం డీలర్ కృష్ణ మాట్లాడుతూ.. భారతి సిమెంట్ పని తీరు చాలా ఫాస్ట్‌గా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ వీరాంజనేయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

యాలాల: అక్రమంగా బెన్నూరు కాగ్నా నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన వాహనం అగ్గనూరు గ్రామానికి చెందినదిగా గుర్తించామని, ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా సీఎం సతీమణి పుట్టినరోజు



కేక్‌కట్ చేస్తున్న రేవంత్ మిత్ర మండలి నాయకులు

మాడ్గుల: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీమణి గీత పుట్టినరోజు వేడుకలు ఆమె స్వగ్రామం మాడ్గుల మండల కేంద్రంలో బుధవారం ఘనంగా జరిగాయి. రేవంత్ మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసీఫ్ ఆలీ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి, బాణసంచా కాల్చారు. శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జంగయ్య, పాండు గౌడ్, భాస్కర్, కష్టయ్య, శివ పాల్గొన్నారు.

మరకత శివాలయంలో సినీనటుడి పూజలు



పృథ్వీరాజ్ దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శంకర్‌పల్లి: మండల పరిధిలోని చెందిప్ప గ్రామంలో వెలసిన 11వ శతాబ్దపు మరకత శివాలయాన్ని బుధవారం సినీ నటుడు పృథ్వీరాజ్ దంపతులు దర్శించుకున్నారు. మరకత లింగానికి అభిషేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి పృథ్వీరాజ్ దంపతులను స్వామివారి శేషవస్త్రంతో సన్మానించారు.

ఇంట్లోకి చొరబడి.. పుస్తెలతాడును అపహరించి



వివరాలు సేకరిస్తున్న సీఐ వీరబాబు, డీఐ సమరం రెడ్డి



బైక్‌పై పారిపోతున్న దుండగుల సీసీపుటేజీ

బైక్‌పై ఉడాయించిన దుండగులు

శంకర్‌పల్లి: వంట గదిలో ఉన్న వృద్ధురాలి మెడలో నుంచి దుండగులు పుస్తెలతాడును అపహరించారు. ఈ సంఘటన మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి కొండకల్ గ్రామానికి చెందిన నారాయణరెడ్డి(82), పద్మమ్(70) దంపతులు. వీరితో కుమారుడు, కోడలు ఉంటున్నారు. బుధవారం కుమారుడు, కోడలు బయటకు వెళ్లారు. మధ్యాహ్నం భర్తకు భోజనం పెట్టేందుకు ఆమె వంట గదిలోకి వెళ్లింది. ఈ క్రమంలో ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు దొంగలు.. ఇంటి ముందు ఆగారు. ఓ వ్యక్తి ఇంట్లోకి చొరబడి వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడుని లాక్కొని.. వెంట వచ్చిన వ్యక్తితో బైక్‌పై పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ వీరబాబు, డీఐ సమరం రెడ్డి వివరాలు సేకరించారు. చుట్టూ పక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి, వెలిమల గ్రామం వైపు వెళ్లినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకుల నిరసన

- జిల్లా కార్యదర్శి మహిపాల్
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నిరసన

బంట్వారం: ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు బుధవారం బంట్వారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడారు. బొప్పునారంలో సర్వే నంబర్ 69లో దళితులకు కేటాయించిన ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే వాటిని స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలన్నారు. భూస్వాముల అక్రమ పట్టాలను వెంటనే రద్దు చేయాలన్నారు. మైనింగ్, బీడు భూములకు రైతుభరోసా నిలిపేయాలని సూచించారు. అనంతరం డీటీ మహేశ్‌కు వారు వినతి పత్రం అందజేశారు.

'ఎక్స్‌పీరియం పార్కు'ను ఎక్స్‌పీరియన్స్ చేయాలి

సినీ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్

శంకర్‌పల్లి: మండల పరిధిలోని ప్రొద్దుటూరులో ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియం ఎకో ఫ్రెండ్లీ పార్కుని ప్రతీ ఒక్కరూ ఎక్స్‌పీరియెన్స్ చేయాలని సినీ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన కుటుంబసభ్యులు, సన్నిహితులతో కలిసి ఎక్స్‌పీరియం పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా పార్కు ఎండీ రాందేవ్ రావు ఇక్కడి వింతలు, విశేషాలు హీరోకి వివరించారు. ఏళ్ల క్రితం నాటి చెట్లు, మొక్కలు వాటి ప్రాముఖ్యతపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు చేరువలో ఇంత పెద్ద పార్కు ఉండడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు.

జీఓ ప్రకారం వేతనాలు ఇవ్వాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు



మేనేజర్ జమీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

మొయినాబాద్: మున్సిపల్ కార్మికులకు జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్, అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం పుర కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పురపాలిక సంఘం ఏర్పడి 9 నెలలు అవుతున్నా.. వేతనాల విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ చట్టం ప్రకారం వేతనాలు, యూనిఫాంలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో విధులు బహిష్కరించి, ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ జమీర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, నాయకులు మహేందర్, అశోక్, నగేష్‌గౌడ్, రత్నం, సుధాకర్, సురేష్, కృష్ణ, జగన్, నర్సింహ్మ, వెంకటేశ్, ప్రమీల ఉన్నారు.

భక్తి భావంతో మానసిక ప్రశాంతత



సేవాలాల్ ఇరుముడి పూజా కార్యక్రమంలో భక్తులు

కడ్తాల్: ప్రతి ఒక్కరూ భక్తిమార్గం ఎంచుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధి మద్దెలకుంట తండాలో సంత్ సేవాలాల్ మహారాజ్ మాలధారణ భక్తుల ఆధ్వర్యంలో ఇరుముడి పూజా కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దశరథ్‌నాయక్ మాట్లాడుతూ.. సేవాలాల్ సత్యం, ధర్మం, సమానత్వం, భక్తి విలువలు బోధించారని, ఆయన చూపిన మార్గంలో యువత నడుచుకోవాలని సూచించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజశాంతికి దోహదపడతాయని తెలిపారు. ఇందులో మాజీ సర్పంచ్ కస్నానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మానాన్నకు దూరమై.. చదువులమ్మకు దగ్గరై..

- ఎంబీబీఎస్ సీటు సాధించిన నిరుపేద విద్యార్థి
- చిన్నాన్న, చిన్నమ్మ సహకారంతో ముందుకు
- డాక్టర్ అయి.. ప్రజాసేవలో తరిస్తా: వంశి



వంశీని సన్మానించిన గ్రామస్తులు, ఉపాధ్యాయులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం చేగిరెడ్డి ఘనాపూర్ గ్రామానికి చెందిన వెన్నశెట్టి మంజుల, జంగయ్య దంపతులకు వంశీకృష్ణ, నందిని ఇద్దరు సంతానం. వీరిద్దరు మూడేళ్లలోపు ఉన్నప్పుడే కన్నవారు దూరం కాగా.. అన్నా, చెల్లెలు అనాథలుగా మిగిలారు. వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఆ సమయంలో ఆ చిన్నారులను చిన్నాన్న బీమయ్య, చిన్నమ్మ యాదమ్మ దంపతులు అక్కున చేర్చుకున్నారు. ఆదర్శంగా తీర్చిదిద్దారు.

చేరదీసినందుకు.. ఉన్నతంగా..

వంశీకృష్ణ, నందినిని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి వరకు చదివించారు. ఆ తరువాత ఇద్దరు గురుకుల పాఠశాలకు ఎంపికై ఉన్నత చదువులు పూర్తిచేశారు. వంశీకృష్ణ గౌలిదొడ్డి గురుకుల కళాశాలలో ఇంటర్‌లో 920 మార్కులు సాదించాడు. ఆపై నీట్ ప్రవేశ పరీక్ష రాసి 407 మార్కులతో నాగర్‌కర్నూల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సంపాదించాడు. అన్నను ఆదర్శంగా తీసుకున్న చెల్లెలు నందిని.. షాద్‌నగర్ పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఇంటర్ పూర్తిచేసి, నాగర్‌కర్నూల్ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది.

ఎవరినీ మరువను.. వంశి

తల్లిదండ్రులను కోల్పోయిన మమ్మల్ని చిన్నాన్న, చిన్నమ్మలు చేరదీసి కన్నబిడ్డలా చూసుకున్నారు. వారి కష్టాన్ని వృథా కానీయకుండా గుర్తింపు తెచ్చుకున్నాను. అండగా నిలిచిన వారిని మరువను. డాక్టర్‌ను అయి.. పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తాను.

ఆర్థికంగా అండగా ఉంటా



వంశిని అభినందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

వంశీకృష్ణ మెడికల్ సీటు సాధించగానే.. అండగా ఉంటామంటూ దాతలు ముందుకు వచ్చారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విద్యార్థిని శాలువాతో సత్కరించి, ఆర్థికంగా ఉంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకుడు కృష్ణ రూ.25 వేలు అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకుడు చందునాయక్ రూ.11 వేలు ఇచ్చారు. మరికొందరు తాము సైతం అంటున్నారు.

బతుకు బాటను చూపించారు



అమ్మానాన్న పోవడంతో మా చిన్నాయన, చిన్నమ్మలు చేరదీసి చదివించారు. నాడు ఉపాధ్యాయులు శివాజీ, వెంకట్రావు మమ్మల్ని బాగా చూసుకున్నారు. పాఠాలు చెప్పడమే కాదు.. బతుకు బాటను చూపించారు. వారి స్ఫూర్తితోనే ఉన్నతంగా చదువుతున్నాం. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నదే నా తపన.

– నందిని